క్లుప్తంగా

రైతులకు రిజిస్ట్రీ తప్పనిసరి



చిట్లపల్లి రైతువేదికలో రిజిస్ట్రీ పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి తులసి

కొడంగల్ రూరల్: పట్టాపాస్ బుక్ కలిగిన రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని వ్యవసాయశాఖ మండల అధికారి జి తులసి సూచించారు. మంగళవారం మండలంలోని చిట్లపల్లి, అంగడిరాయిచూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న రైతు నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 17,449 రైతులు ఉన్నారని, ఇందులో కేవలం 5,825మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. మిగిలిన రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాల యొక్క ప్రయోజనాలు అందాలంటే వారు కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి కిసాన్ (పీఎం కిసాన్) పథకం లబ్ధిపొందాలంటే రిజిస్ట్రేషన్ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఇసాక్ హెరాల్డ్, పావని, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పలకలు పంపిణీ



పలకలు అందిస్తున్న పాఠశాల సిబ్బంది

కొడంగల్ రూరల్: బాసరలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పలకలను విద్యార్థులకు మంగళవారం వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు పంపిణీ చేశారు. మండల పరిధిలోని హుస్సేన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో 22మంది 1వ, 2వ తరగతుల్లో చదువుతున్నారు. ఈ సందర్భంగా బాసరలో పూజలు నిర్వహించిన పలకలను వారికి అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషిచేయాలని, నాణ్యమైన విద్యతోపాటు ఉచిత దుస్తులు, మధ్యాహ్న భోజనం, పాఠ్య, నోటు పుస్తకాలను అందజేస్తున్నారని హెచ్ఎం క్రాంతికుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కన్వీనర్‌గా స్వరూపరాణి



నియామకపత్రం అందుకుంటున్న స్వరూపరాణి

పరిగి: తెలంగాణ ముదిరాజ్ సంఘం జిల్లా కన్వీనర్‌గా స్వరూపరాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌ముదిరాజ్ ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ముదిరాజ్‌లను ఏకం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముదిరాజ్‌లు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి సామాజిక చైతన్యం తీసుకొస్తానన్నారు. ముదిరాజ్‌లను బీసీ–డి నుంచి ఏ గ్రూపులోకి మార్చేంత వరకు పోరాటం చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్, సంజీవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు చేరకుండా చర్యలు

ఎంపీఓ యాదయ్య



జక్కేపల్లిలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీఓ తదితరులు

యాలాల: గ్రామాల్లో ఇళ్ల ఎదుట మురుగు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారి గాలి యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జక్కేపల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో ఇళ్ల ఎదుట మురుగునీరు ఉండటాన్ని గమనించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అనంతరం గ్రామ కంఠం భూమిని ఆక్రమించి చేపడుతున్న ప్రహరీని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యాదిరెడ్డి, అమృతయ్య, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మన్నెగూడ సంత.. తీరని చింత

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు



షెడ్లు లేక పరదాలతో దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు

పూడూరు: ప్రభుత్వాలు మారినా మన్నెగూడ మార్కెట్ యార్డుకు మోక్షం కలగడం లేదు. పూడూరు మండల పరిధిలోని మన్నెగూడలో నిర్వహించే వారాంతపు సంతలో సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ వ్యాపారులకు, కొనుగోలు దారులు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టించుకునే అధికారులు కరువయ్యారు. కొన్నేళ్లుగా ప్రతి మంగళవారం సంత నిర్వహిస్తున్నారు. అక్కడ మాత్రం వారికి చింత తీరడం లేదు. మండల పరిధిలో చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు కూరగాయలను తెచ్చి విక్రయిస్తుంటారు. వారికి కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు లేరు. సంతలో షెడ్లు లేవని, వర్షం వస్తే సరుకులు తడిసి పోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండకు ఎండి, వానకు తడవాల్సిందేనని వ్యాపారులు చెబుతున్నారు. తాగునీరు, విద్యుత్తు దీపాలు లేక వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షెడ్లు లేక కూరగాయల దుకాణాలకు పరదాలు వేసుకుని అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి షెడ్లను ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

నిధులు మంజూరైనా పనులు జరగడం లేదు..

మన్నెగూడలో మార్కెట్ యార్డు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో పనులు సాగడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గతంలో రెండు పర్యాయాలు మార్కెటింగ్ శాఖ అధికారులు మన్నెగూడ మార్కెట్ యార్డును పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. దీంతో రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని మార్కెటింగ్‌శాఖకు అప్పగించారు. అప్పట్లో మార్కెట్ యార్డు కోసం రూ.15లక్షలు కేటాయించారు. అక్కడ నేటికి నిర్మాణ పనులు మాత్రం ప్రారంభించలేదు.

తైబజార్ ద్వారా డబ్బులు వసూలు

కొన్నేళ్లుగా తైబజార్‌ను వేలం వేస్తున్నారు. మార్కెట్‌లో మాత్రం ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. తాగడానికి మంచినీరు, విద్యుత్ సౌకర్యం వంటివి కూడా కల్పించడం లేదు. ప్రతి వారం మార్కెట్ స్థలంలో ఏర్పాటు చేసిన ప్రతి దుకాణానికి డబ్బులు వసూలు చేస్తున్నారు. దీంతో గ్రామ పంచాయతీకి ఆదాయం చేకూరుతుంది. సౌకర్యాలు మాత్రం నిల్.

ఆదాయం ఉన్నా.. పనులు మాత్రం సున్నా



ప్రభుత్వం అన్ని వసతులతో మార్కెట్ యార్డును నిర్మించాలి. సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వేసవికాలం, వర్షాకాలాల్లో తీవ్ర నష్టాల పాలవుతున్నాం. షెడ్లు నిర్మించి విద్యుత్తు, తాగునీటి వసతిని కల్పించాలి. తైబజార్ ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆదాయం ఉన్నా.. పనులు మాత్రం సున్నా.

– వెంకటయ్య, దేవనోనిగూడ

నీటి సౌకర్యం కల్పించాలి



పూడూరు మండల పరిధిలో సంతలో సౌకర్యాలు కల్పించాలి. రైతులకు, వ్యాపారులకు, కొనుగోలు దారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సంతకు వస్తే కనీసం తాగునీరు కూడా దొరకని పరిస్థితి. వ్యాపారులు, రైతులు తెచ్చిన కూరగాయలను నిల్వచేసుకునేందుకు గోదాములు లేవు.

– రాములు, చీలాపూర్

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్
దేశ వ్యాప్త సమ్మెకు పిలుపు



గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీఓ యాదయ్య తదితరులు

యాలాల: పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బుగ్గప్ప కోరారు. మంగళవారం యాలాల మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ..కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందడం లేదని దీంతో వారు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారన్నారు. పంచాయతీల్లో కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటుందని మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 9న దేశ వ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. సమ్మెకు సంబంధించిన నోటీసును ఎంపీఓ యాదయ్యకు అందజేశారు.

పంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులు..

మండలంలోని పంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులను ఎంపీఓ యాదయ్య పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆరిఫ్, కార్మికులు షబ్బీర్, శ్యామమ్మ, అంతమ్మ, చంద్రప్ప, మొగులప్ప, లక్ష్మీ, శివకుమార్ పాల్గొన్నారు.

మెరుగైన విద్యా బోధన చేపట్టాలి

ఎంపీడీఓ గ్యామా



మాట్లాడుతున్న ఎంపీడీఓ గ్యామా

దోమ: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా బోధన చేపట్టాలని ఎంపీడీఓ గ్యామా సూచించారు. మంగళవారం దోమ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ వెంకట్ ఉపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తుందని, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, దుస్తువులు, నోట్‌బుక్స్‌తో పాటు రుచి కరమైన మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అమర్నాథ్, ఆంజనేయులు, లాల్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీవిద్య, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

గిరిజన సంక్షేమ శాఖ బ్లాక్ లెవల్ అధికారి రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

మోమిన్‌పేట: గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని సంక్షేమ శాఖ బ్లాక్ లెవల్ అధికారి రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాళ్లగూడుపల్లి గ్రామంలో వారికి అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ధర్తీ అబ్ జన గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. దేశంలో ఈ పథకం ద్వారా 5కోట్ల మందికి ప్రయోజనం కలగనుందన్నారు. గిరిజన యువతకు మెరుగైన విద్య అవకాశాలు లభించినప్పుడే వానే అభివృద్ధి చెందుతారన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఆరోగ్యం, విద్యా సదుపాయాలు వంటి వసతులు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అన్నపూర్ణ, నాయకులు లక్ష్మయ్య, బాలు గౌడ్, రవి కుమార్ నాయక్, బాస్కర్‌నాయక్, సర్దార్‌నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం

- తెగిపడ్డ విద్యుత్ వైరు
- ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు



హైదరాబాద్ బీజాపూర్ రోడ్డుపై తెగిపడిన విద్యుత్ వైరు

పూడూరు: ఈదురు గాలులతో కూడిన వర్షానికి హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి కండ్లపల్లి గేటు సమీపంలో 11కెవి విద్యుత్తు వైరు తెగిపడింది. దీంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న వైర్‌ను గమనించిన ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. వెంటనే విద్యుత్తు అధికారులకు సమాచారం చేరవేశారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది కరెంట్ వైరును తొలగించారు. అర గంటకు పైగా వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి. ఈ సంఘటనలో ఎవరికి ఏ ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దాతకు రశీదు ఇస్తున్న ఉమాపతి గౌడ్

కొడంగల్: పట్టణ శివారులో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు విరాళం అందజేశారు. సదాశివపేటకు చెందిన శంకర్ గురుస్వామితో పాటు మిత్రులు రూ.75వేలు ఆలయ కమిటీ సభ్యులు పీ.శ్రీనివాస్‌గౌడ్, ఉమాపతి గౌడ్‌లకు అందజేశారు. కొడంగల్ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో బీజాపూర్–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన అయ్యప్ప స్వామి ఆలయం నిర్మిస్తున్నారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణం జోరుగా సాగుతోందని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్ర యాదవ్, కానుకుర్తి నర్సిరెడ్డి కోరారు.

ధారూరులో విద్యుత్ అంతరాయం

- మూడు రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

దారూరు: నిరవధిక విద్యుత్ సరఫరా లేక పోవడంతో మంగళవారం వినియోగదారులు, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ధారూరు, మున్నూరుసోమారం విద్యుత్ సబ్ స్టేషన్లకు వెళ్లి వారు సిబ్బందిపై మండిపడ్డారు. తాండూర్ నుంచి ఇన్‌కమింగ్ పోయిందని అధికారులు చేతులెత్తేశారు. కాస్త గాలి వీచినా, చినుకు పడినా సబ్‌స్టేషన్ల పరిధిలో లక్కున విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. మూడు రోజుల నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా 8 గంటల నుంచి 12 గంటల పాటు విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయి. రాత్రిళ్లు అంధకారంలో మగ్గుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ అంతరాయాలు ఉండేవి కావని, ప్రస్తుతం ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలి

యాలాల: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మెదడు పాఠ్యాంశ బోధన అంశంలో సైన్స్ టీచరు ఖాసీంబీపై పెట్టిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తేయాలని రాష్ట్ర మైనార్టీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్ మంగళవారం డిమాండ్ చేశారు. విద్యార్థులకు ప్రాక్టికల్ రూపంలో బోధించే ఉద్దేశంతో టీచరు ప్రయత్నించారని, కానీ ఇందులో కొందరూ సహచర ఉపాధ్యాయులు విద్వేషాలు రెచ్చగొట్టేలా చేయడం దురదృష్టకరమన్నారు. ఈ విషయంలో పూర్తి విచారణ చేయకుండానే విద్యాశాఖ అధికారులు ఏకపక్షంగా సస్పెన్షన్ విధించడం అన్యాయమన్నారు. ఈ విషయంలో కలెక్టర్ దృష్టి సారించి టీచరుపై పెట్టిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తేయాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ **పరిగి తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి**

యాలాల: ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన పరిగి తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రంగంపల్లి గ్రామానికి చెందిన ఎకర భూమిని అక్రమార్కులకు కట్టబెట్టారని గోవిందపూర్‌లో 16 ఎకరాల సీలింగ్ భూమిని రిజిస్ట్రేషన్ చేశారని మండిపడ్డారు. ఖాస్రా, చస్లా, కారీజు ఖాతాలలో ఆయా సర్కారు భూములుగా ఉన్నప్పటికీ ఇటువంటి చర్యలకు దిగడం బాధాకరమన్నారు. ఇటువంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలక్కయ్య, వ.కా.స. జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, నాయకులు నరేశ్, ముజీబ్, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.

◆ **బొంరాస్‌పేటలో..**

బొంరాస్‌పేట: అసైన్డ్ భూముల అమ్మకాలు, అక్రమ మట్టి వ్యాపారం వంటి చట్టవిరుద్ధ పనులతో ఆరోపణలు ఎదుర్కొంటున్న పరిగి మండల తహసీల్దారు ఆనంద్‌రావును వెంటనే సస్పెండ్ చేయాలని మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దారు పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

◆ **అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ మృతి**

యాలాల: అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ మృతి చెందారు. యాలాల మండల కేంద్రానికి చెందిన నాగారం రాములుగౌడ్(70) యాలాల ఎంపీటీసీగా సేవలందించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం పరిస్థితి విషమించి తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రాములుగౌడ్ మృతి తెలుసుకున్న నాయకులు వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

◆ **చిరుధాన్యాల సాగు లాభసాటి**

యాలాల: చిరుధాన్యాల సాగుతో రైతులకు లాభం కలుగుతుందని రాస్నం క్లస్టర్ ఏఈఓ శిరీష పేర్కొన్నారు. మంగళవారం రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ..రైతులకు వ్యవసాయంలో మేలు చెయ్యాలనే ధ్యేయంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అధికారులు, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు జాగ్రత్తలు తీసుకుంటే వ్యవసాయం లాభసాటి అవుతుందన్నారు.

◆ **ఆదర్శంగా నిలవాలి**

కుల్కచర్ల: జీవితంలో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కుల్కచర్ల ఎస్ఐ రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్న, చిన్న ఆనందాలకు తప్పుడు విధానాలను అవలంబించొద్దన్నారు. క్షణిక సంతోషాలకు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. బాల్యవివాహాలు ఎక్కడైన జరుగుతుందని గుర్తిస్తే 1098కి ఫోన్ చేసి సమాచారం చేరవేయాలని, ఇబ్బందికర పరిస్థితిలో 100కి ఫోన్ చేయొచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాజాత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ **పంచాయతీ అవార్డు కోసం వివరాల సేకరణ**

పూడూరు: నేషనల్ పంచాయతీ అవార్డుల కోసం వివరాలను సేకరిస్తున్నామని ఎంపీడీఓ పాండు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నేషనల్ పంచాయతీ అవార్డు కోసం మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వ్యవసాయం, శిశు సంక్షేమం, పంచాయతీ తదితర శాఖల్లో 2023–24 ఏడాదికి సంబంధించి సాధించిన రిపోర్టులను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ శాఖల నుంచి సమాచారం సేకరించారు. అనంతరం గొంగుపల్లి, చీలాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఓ తులసిరాం, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీ



రేషన్ బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న నాయకులు

కుల్కచర్ల: ప్రజలకు ఇబ్బంది లేకుండా రేషన్ సరుకుల పంపిణీ సమయాన్ని పెంచారని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలో రేషన్ బియ్యం పంపిణీ కేంద్రాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. ప్రజల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని పౌర సరఫరాలశాఖ జులై 29వరకు పొడిగించిందన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆనందం, మాజీ ఎంపీపీ అంజిలయ్య, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్, నాయకులు రాంచంద్రయ్య, మోర వెంకటేశ్, ఎల్లయ్య, భాను తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాజ్యాంగ వ్యతిరేఖి

భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్‌నాయక్



రాస్తారోకో నిర్వహిస్తున్న భారత్‌ముక్తి మోర్చా నాయకులు

పరిగి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేఖంగా వ్యవహరిస్తోందని భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం భారత్ బంద్‌లో భాగంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణకేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కొత్తగా ఈవీఎంలను తీసుకువచ్చి దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఈవీఎంలను చాలావరకు ప్రపంచ దేశాలు సైతం వాడటం లేదన్నారు. కుట్రపూరితంగానే ఈవీఎంలను అమలు చేసి ట్యాంపరింగ్‌తో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. పది సంవత్సరాల బీజేపీ పాలనలో పేదలకు ఒరిగిందేమిలేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎరన్‌పల్లి శ్రీనివాస్, రాములు, వెంకట్, సత్తయ్య, రఘురాం, సూర్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే నిర్మాణ పనులు చేపట్టండి



తాండూరు రూరల్: సంకిరెడ్డిపల్లిలో లబ్ధిదారు జయమ్మకు ప్రొసీడింగ్ అందజేస్తున్న అధికారులు



ధారూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేయించి పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ నర్సింహులు

- ఎంపీడీఓ విశ్వప్రసాద్
- లబ్ధిదారులతో కలిసి భూమిపూజ చేసిన అధికారులు

తాండూరు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్, హౌసింగ్ ఏఈ రహీంలు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని సంకిరెడ్డిపల్లి గ్రామంలో లబ్ధిదారు జనగామ జయమ్మ ఇంటికి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంకిరెడ్డిపల్లి గ్రామంలో 13 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మల్లిఖార్జున్, రాములు, వీరన్న, నాయకులు నర్సిరెడ్డి, జగదీశ్, రిజ్వానబేగం, జయమ్మ, గోపాల్, కెస్లిభాయ్, చరన్‌సింగ్ పాల్గొన్నారు.

తరిగోపుల గ్రామంలో..

ధారూరు: తరిగోపుల గ్రామంలో లబ్ధిదారులకు ఎంపీడీఓ నర్సింహులు, గ్రామ కార్యదర్శి స్వప్న, కాంగ్రెస్ నాయకుడు గఫార్‌లతో కలిసి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేయించారు. తరిగోపుల గ్రామంలో అర్హులైన 25 మందికి ఇళ్లు మంజూరయ్యాయన్నారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

దుద్యాల్: గ్రామాలు, పల్లెలు సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిలుముల మైల్వార్, ముచ్చుకుంట తండా, గౌరారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్యతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు ఒక్క ఇళ్లు కూడా మంజూరు చేయలేదన్నారు.